TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 151   శుక్రవారం 24-01-2025   పేజీలు :06   వేల : 05/-

# దావోస్ లో తెలంగాణ ధమాక

◈రూ. 1.32 లక్షల కోట్ల పెట్టుబడుల వెల్లువ

◈ కొత్త ఒప్పందాలతో 46 వేల మందికి ఉద్యోగాలు

◈రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఇదే అతి పెద్ద రికార్డు

◈10 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న ప్రభుత్వం

◈గత ఏడాదితో పోలిస్తే మూడింతలు మించిన పెట్టుబడులు



**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 23 :** దావోస్లో పెట్టుబడుల సమీకరణలో తెలంగాణ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడుల రికార్డు నమోదు చేసింది. దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఇప్పటికే రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. గత ఏడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఈసారి మూడింతలకు మించిన పెట్టుబడులు రావటం విశేషం. దావోస్ వేదికపై ఈసారి తెలంగాణ రాష్ట్రం అందరి దృష్టిని ఆకర్షించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారధ్యంలో తెలంగాణ రైజింగ్ బృందం దావోస్లో వివిధ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయి. హైదరాబాద్లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకుంది. దీంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో విస్తరణకు ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళికలు పెట్టుబడుల వెల్లువకు దోహదపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ రైజింగ్ 2050 విజన్ గేమ్ ఛేంజర్గా నిలిచింది. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణమున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సరళతర పారిశ్రామిక విధానంతో పాటు ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామికవేత్తలను దృష్టిని ఆకర్షించింది. దేశ విదేశాలకు చెందిన పేరొందిన పది ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఐటీ, ఏఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించినట్లుగా భారీ పెట్టుబడులను సాధించింది. దావోస్ లో వరుసగా మూడు రోజుల పాటు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో దాదాపు 46 వేల మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి.




# అమెరికాలో వేల సంఖ్యలో ఉగ్రవాదులు, హంతకులు

## - దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**న్యూయార్క్ జనవరి 23 :** అమెరికాలో వేల సంఖ్యలో ఉగ్రవాదులు, హంతకులు ఉన్నట్లు దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. మాజీ అధ్యక్షుడు బైడెన్ అమలు చేసిన అనేక విధానాలను రద్దు చేయనున్నట్లు ఆయన చెప్పారు. దేశాధ్యక్ష బాధ్యతలు తీసుకున్న తర్వాత పలు ఎగ్జిక్యూటివ్ ఆదేశాలపై ఆయన సంతకం చేశారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉన్న డ్రగ్ కార్టల్స్‌ను విదేశీ ఉగ్ర సంస్థలుగా అభివర్ణించారు. హౌతీ రెబల్స్‌ను కూడా తీవ్రవాద గ్రూపుగా ట్రంప్ పేర్కొన్నారు.దేశంలో వేల సంఖ్యలో ఉగ్రవాదులు ఉన్నారని, వేల వేల సంఖ్యలో హంతకులు కూడా ఉన్నారని, వారందర్నీ అణిచివేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాలో ప్రస్తుతం 11 వేల మంది హంతకులు జీవిస్తున్నట్లు చెప్పారు. దాంట్లో 48 శాతం మంది.. ఒకరి కన్నా ఎక్కువ మందిని హతమార్చినట్లు ఆయన పేర్కొన్నారు. విదేశాల్లో జైళ్లలో ఉన్న వారు అమెరికాకు వచ్చేస్తున్నట్లు తెలిపారు. వెనిజులాలో క్రైం రేటు 78 శాతం తగ్గినట్లు ట్రంప్ చెప్పారు. విదేశాల్లోని వీధి గ్యాంగ్‌లు ఇప్పుడు అమెరికాకు వచ్చేశాయని, ఆ ముఠాల ఆగడాలను కొలరాడో, లాస్ ఏంజిల్స్‌లో చూస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.పీవ్ రీసెర్చ్ సెంటర్ ప్రకారం.. అమెరికాలో 40 లక్షల మంది మెక్సికన్లు అక్రమంగా జీవిస్తున్నారు. 2022లో సరిహద్దు ద్వారా సుమారు లక్షన్నర మంది మెక్సికన్లు అమెరికాలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అమెరికాకు వలస వెళ్తున్న వారిలో భారత్, చైనా, వెనిజులా, క్యూబా, బ్రెజిల్, కెనడా దేశస్థులు ఉన్నారు.



# ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో భారతదేశం

## - ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి జనవరి 23 :** ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో ఉందని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, సరైన సమయంలో సాంకేతికత అందిపుచ్చుకోవాలని సూచించారు. జనాభా వైవిధ్యం, సుస్థిర వృద్ధిరేటు, పటిష్టమైన విధానాలతో పాటు సరైన నాయకత్వంతో ఇండియా బ్రాండ్ బలంగా ఉందని పేర్కొన్నారు. దావోస్‌లో మూడో రోజు సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎపి బృందం ప్రఖ్యాత కంపెనీల సిఇఒలు, సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. భారత దేశం బ్రాండ్ ఇప్పుడు చాలా స్ట్రాంగ్ గా ఉందని, దావోస్ లో వివిధ రాష్ట్రాలు పెట్టుబడుల కోసం పోటీపడుతున్నాయని తెలియజేశారు.దేశం కోసం అందరం కలిసి పని చేస్తున్నామని, సిఎంలుగా వేర్వేరు పార్టీలకు చెందినా, ప్రజల కోసం ఐక్యంగా ఆలోచిస్తామని బాబు వివరించారు. మేమంతా వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వారిమైనప్పటికీ భారత్ కోసమే పని చేస్తున్నామన్నారు. తాము దావోస్ నుంచి టెక్నాలజీని తీసుకెళ్లడానికి రాలేదని, ప్రపంచానికే మా దేశం టెక్నాలజీని


2లో

# యూన్ కేసు ప్రాసిక్యూటర్ల కార్యాలయానికి బదిలీ



**సియోల్ :** అభిశంసనకు గురైన అధ్యక్షుడు యూన్‌పై నేరారోపణ కోసం ఈ కేసును ప్రాసిక్యూటర్ల కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్లు దక్షిణ కొరియా అవినీతి నిరోధక సంస్థ (సిఐఒ) గురువారం తెలిపింది. యూన్‌పై అధికార దుర్వినియోగంతో పాటు ఇతరుల హక్కులను వినియోగించుకోకుండా అడ్డుకోవడం, తిరుగుబాటు అభియోగాలు మోపవలసిందిగా ప్రాసిక్యూటర్లను అభ్యర్థించనున్నట్లు సిఐఒకి చెందిన ఉన్నతాధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.అధ్యక్షుడు, వారి కుటుంబ సభ్యులతో సహా ఉన్నత స్థాయి అధికారులపై విచారణ చేపట్టడానికి 2021లో సిఐఒ ప్రారంభమైంది. ఈ అధికారులతో పాటు పోలీసులు, రక్షణమంత్రిత్వ శాఖతో కూడిన ఉమ్మడి బృందం విచారణ చేపడుతుంది. అయితే పరిమిత హక్కులు కలిగి ఉండటంతో సిఐఒ అధ్యక్షుడిని దర్యాప్తు చేసే అధికారం లేదు. దీంతో తదుపరి చర్య కోసం కేసును ప్రాసిక్యూటర్ల కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుంది. తిరుగబాటు అంశంపై విచారణ చేపట్టే హక్కు సిఐఒకి లేదు. యూన్ కేసును విచారించే అధికారం సిఐఒకు లేదంటూ ఆయన తరపు న్యాయవాదులు వాదిస్తున్న సంగతి తెలిసిందే.

# కాశ్మీర్ ప్రజల హక్కులకు మద్దతు



ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రకారం కాశ్మీర్ ప్రజలు స్వయం నిర్ణయాధికార హక్కును సాధించే వరకు పాకిస్తాన్ వారికి రాజకీయ, నైతిక, దౌత్యపరమైన మద్దతును కొనసాగిస్తుందని పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ అన్నారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రకారం కాశ్మీర్ ప్రజలు స్వయం నిర్ణయాధికార హక్కును సాధించేవరకు వారికి రాజకీయ, నైతిక మరియు దౌత్యపరమైన మద్దతును కొనసాగించడానికి పాకిస్తాన్ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. డానిష్ పాఠశాలకు శంకుస్థాపన చేసిన షెహబాజ్, పిఓకెలోని ఇతర ప్రాంతాలలో, పాకిస్తాన్‌లోని ఇతర ప్రాంతాలలో కూడా ఇలాంటి మరిన్ని పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జమ్మూ కాశ్మీర్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగంగా ఉంటుందని భారతదేశం పదేపదే పాకిస్తాన్‌కు చెప్పింది. ఉగ్రవాదం, శత్రుత్వం మరియు హింస లేని వాతావరణంలో పాకిస్తాన్‌తో సాధారణ పొరుగు సంబంధాలను కోరుకుంటున్నట్లు భారతదేశం పేర్కొంది.

# లాస్ ఏంజిల్స్‌లో మరో ప్రాంతంలో కార్చిచ్చు

లాస్ ఏంజిల్స్ : అమెరికాలోని లాస్ ఏంజిల్స్ లో కఠినమైన పర్వతాలలోని మరో ప్రాంతంలో మంటలు చెలరేగాయి. వేగంగా కదులుతున్న కార్చిచ్చు వలన 50,000 మందికి పైగా ప్రజలు ఖాళీ చేయమని ఆదేశాలు జారీ చేశామని అధికారులు తెలిపారు. ఇటీవల హాలీవుడ్ తదితర ప్రాంతాల్లో చెలరేగిన కార్చిచ్చు అదుపులోకి రాకముందే మరోకటి మొదలు కావడం ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. గురువారం తెల్లవారుజామున చెలరేగి తాజా కార్చిచ్చు 15 చదరపు మైళ్ల (39 చదరపు కిలోమీటర్లు) చెట్లు, పొదలను వేగంగా కాల్చివేసింది. ఆ ప్రాంతంలో గాలులు బలంగా విస్తున్నాయని, దీని వలన మరింతగా మంటలు చెలరేగే అవకాశం ఉందని వారు తెలిపారు. మంటలను అదుపు చేయడం కష్టంగా ఉన్నప్పటికీ అగ్నిమాపక సిబ్బంది పైచేయి సాధిస్తున్నారని కౌంటీ అగ్నిమాపక అధికారి ఆంథోనీ మర్రోన్ తెలిపారు. గాలితో నడిచే మంటలు అంతర్‌రాష్ట్రాన్ని దాటకుండా, కాస్టాయిక్ వైపు ముందుకు సాగకుండా ఆపడానికి గ్రౌండ్ సిబ్బంది, నీటి బాంబులు వేసే విమానం పనిచేస్తున్నాయని తెలిపారు.

# ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో భారతదేశం

అందజేస్తోందని, అది మా భారతీయుల సత్తా అని ప్రశంసించారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ విశేష కృషి చేస్తోందని బాబు స్పష్టం చేశారు. దాదాపు అన్ని టెక్ కంపెనీల సిఇఒలు భారత సంతతికి చెందినవారే ఉన్నారని, సాంకేతికతను ముందుగా అందిపుచ్చుకున్న దేశంగా భారత్ ప్రయోజనాలు పొందుతోందన్నారు. వ్యాపార దక్షత, నైపుణ్యాలు ఉన్న యువత, జనాభా ఎక్కువగా ఉండటం భారత్ కు వరాలని సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తానికి ఇండియా సేవలందిస్తోందని, ప్రపంచంలో అన్ని ప్రాంతాల ప్రజలకు అత్యంత ఆమోదయోగ్యులు భారతీయులే ఉన్నారని చంద్రబాబు తెలియజేశారు.

# ఏపి కి మరో ఇద్దరు న్యాయమూర్తులు..

## 30కు చేరిన న్యాయమూర్తుల సంఖ్య

**అమరావతి జనవరి 23 :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెరిగింది. తాజాగా మరో ఇద్దరు న్యాయమూర్తులను నియమించడంతో ఆ సంఖ్య 28 నుంచి 30కు చేరుకుంది. రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథ శర్మ , డాక్టర్ యడవల్లి లక్ష్మణరావును నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది మూర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ ఇద్దరు శుక్రవారం అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం చేసే అవకాశంముంది. రాష్ట్ర హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులకు గాను ప్రస్తుతం 28 మంది పనిచేస్తున్నారు. ఇద్దరి నియమకంతో ఆ సంఖ్య 30కు చేరుకోగా మరో 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. . వీరు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు అదనపు న్యాయమూర్తులుగా , ఆతరువాత శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులవుతారు. న్యాయాధికారుల కోటా నుంచి వీరి పేర్లను సుప్రీంకోరు సీజే నేతృత్వంలోని కొలీజియం సిఫారస్ చేస్తూ ఈనెల 11న తీర్మానం చేసింది.

# పనామా కాలువ..అమెరికా కానుక కాదు..

## జోస్ రౌల్ ములినో

**–వోస్:** పనామా కాలువ తమదేనంటూ గత కొన్ని రోజులుగా డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తీవ్రంగా స్పందించారు. ఈ కాలువను అమెరికా తమకేం బహుమతిగా ఇవ్వలేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ములినో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పనామా కాలువపై ట్రంప్ చెప్పిన ప్రతి మాటను మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఎందుకంటే అదంతా అవాస్తవం. ఆ కాలువ అమెరికా నుంచి మాకు రాయితీగానో.. బహుమతిగానో వచ్చింది కాదు. అది మాది. మాకు మాత్రమే సొంతం"



అని తెలిపారు. అలాగే ఈ కాలువ విషయంలో చైనా ఎలాంటి జోక్యం చేసుకోవడం లేదని ఆయన తెలిపారు. ఇలాంటి ప్రకటనలతో పనామా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. ట్రంప్ ఇటీవల పలు సందర్భాల్లో మాట్లాడుతూ పనామా కాలువ తమదేనని, తప్పకుండా వెనక్కి తీసుకుంటామని చెబుతున్నారు.

# వెస్ట్ బ్యాంక్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయిల్

**జెరూసలేం :** ఒకపక్క గాజాలో కాల్పుల విరమణ అమల్లో వుండగా, మరోపక్క వెస్ట్ బ్యాంక్ నగరమైన జెనిన్‌పై ఇజ్రాయిల్ సైనిక బలగాలు హెలికాప్టర్లతో మంగళవారం విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో 9మంది పాలస్తీనియన్లు మరణించారు. 35మంది గాయపడ్డారు. పెద్ద ఎత్తున జరిగిన మిలటరీ ఆపరేషన్ ఇదని ప్రధాని బెంజామిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. పాలస్తీనా గ్రామాలపై దాడి చేసిన ఇజ్రాయిల్ సెటిలర్లపై ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ దాడులు చోటు చేసుకున్నాయి. గాజా, లెబనాన్, సిరియా, యెమెన్, జుడియా, సామారియా ఇలా ఎక్కడ ఇరాన్ తన ప్రభావం చూపించినా అక్కడ తాము కచ్చితంగా, కృతనిశ్చయంతో వ్యవహరిస్తామని నెతన్యాహు చెప్పారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ గురించి చెప్పేటపుడు జుడియా, సామారియా అనే పదాలను ఇజ్రాయిల్ ఉపయోగిస్తూ వుంటుంది. గాజాలో కాల్పుల విరమణ ప్రారంభమైన రెండు రోజుల తర్వాత జెనిన్‌పై దాడులు జరిగాయి. సైనికులు, పోలీసులు, ఇంటెలిజెన్స్ సర్వీసులు జెనిన్‌లో తీవ్రవాద నిరోధక ఆపరేషన్‌ను ప్రారంభించాయని మిలటరీ ప్రకటించింది. శరణార్ధ శిబిరం, హమాస్, ఇస్లామిక్ జిహాద్‌లకు చెందిన ప్రధాన కేంద్రంపై తమ పట్టును పునరుద్ఘాటించేందుకు వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనా భద్రతా బలగాలు వారాల తరబడి ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఆ నేపథ్యంలో మిలటరీ ప్రకటన వెలువడింది. ఇటీవల కాలంలో హమాస్ తన కార్యకలాపాలను వెస్ట్ బ్యాంక్‌లో విస్తరిస్తోంది. ఇజ్రాయిల్‌పై పోరాటాన్ని ఉధృతం చేయాల్సిందిగా మంగళవారం హమాస్ పాలస్తీనియన్లకు పిలుపిచ్చింది. ఆపరేషన్ ప్రారంభం కాగానే, పాలస్తీనా భద్రతా బలగాలు శరణార్ధ శిబిరం నుండి వైదొలిగాయి. పెద్ద ఎత్తున కాల్పుల మోత కూడా వినిపించింది. ఇజ్రాయిల్ జరిపిన ఈ దాడుల్లో 9మంది మరణించారని, 35మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య సేవల విభాగం తెలిపింది.

# జూట్‌కు ఎంఎస్‌పి.. కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ముడిజూట్‌కు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఈఎ) 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం ముడి జూట్ ఎంఎస్‌పి ఆమోదించింది. 2025-26 సీజన్‌లో రా జూట్ (టిడి-3 గ్రేడ్) ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.5,650గా నిర్ణయించింది. ఇది మొత్తం దేశపు సగటు ఉత్పత్తి వ్యయం కంటే 66.8 శాతం రాబడిని నిర్ధారిస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2025-26 మార్కెటింగ్ సీజన్ కోసం ఆమోదించబడిన ముడి జూట్ ఎంఎస్‌పి 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన విధంగా కనీసం 1.5 రెట్లు ఆల్ ఇండియా వెయిటెడ్ సగటు ఉత్పత్తి వ్యయం స్థాయిలో ఎంఎస్‌పిని నిర్ణయించే సూత్రానికి అనుగుణంగా ఉంది. మార్కెటింగ్ సీజన్ 2025-26 కోసం ముడి జూట్ ఎంఎస్‌పి గత మార్కెటింగ్ సీజన్ 2024-25 కంటే క్వింటాల్‌కు రూ.315 పెరిగింది. కేంద్ర ప్రభుత్వం 2014-15లో క్వింటాల్‌కు రూ.2400కి చెందిన ముడి జనపనార ఎంఎస్‌పిని 2025-26లో రూ.5,650కి పెంచింది. క్వింటాల్‌కు రూ. 3,250 (2.35 రెట్లు) పెరిగిందని తెలిపింది. 2014-15 నుండి 2024-25 మధ్య కాలంలో జనపనార సాగు చేసే రైతులకు చెల్లించిన ఎంఎస్‌పి మొత్తం రూ. 1,300 కోట్లు కాగా, 2004-05 నుంచి 2013-14 మధ్య కాలంలో చెల్లించిన మొత్తం రూ. 441 కోట్లని పేర్కొంది. 40 లక్షల వ్యవసాయ కుటుంబాల జీవనోపాధి ప్రత్యక్షంగా, పరోక్షంగా జూట్ పరిశ్రమపై ఆధారపడి ఉంది. దాదాపు 4 లక్షల మంది కార్మికులు జూట్ మిల్లుల్లో ప్రత్యక్ష ఉపాధిని పొందుతున్నారు, జూట్ వ్యాపారం చేస్తున్నారు. గతేడాది 1.70 లక్షల మంది రైతుల నుంచి జనపనారను కొనుగోలు చేశారు. జనపనార రైతులలో 82 శాతం పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు కాగా మిగిలిన అస్సాం. బీహార్‌లు జూట్ ఉత్పత్తిలో 9 శాతం వాటా కలిగి ఉన్నారు. జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జెసిఐ) ప్రైస్ సపోర్టు కార్యకలాపాలను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా కొనసాగుతుంది. అటువంటి కార్యకలాపాలలో ఏవైనా నష్టాలు ఉంటే, కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రీయింబర్స్ చేస్తుంది. మరోవైపు జాతీయ ఆరోగ్య మిషన్ (2021-24) కింద సాధించిన విజయాల గురించి కేంద్ర మంత్రివర్గం వివరించింది. దేశ ప్రజారోగ్య ఫలితాలను మెరుగుపరచడంలో ఒక మైలురాయిగా నిలిచిందని పేర్కొంది.

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు ఇంకెంత కాలం ?

**- మీ వైఖరితో బీసీలకు తీరని అన్యాయం**

**- రిజర్వేషన్ల పెంపును విస్మరిస్తే ఊరుకోబోం**

**- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాల్సిందే**

**- సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ**

**హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ మేరకు గురువారం నాడు ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి 2024-25 బడ్జెట్ లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్ ను సీఎం రేవంత్ రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల బీసీ వర్గాల్లో ఏ మాత్రం విశ్వాసం లేదని, ఈ వైఖరితో రాష్ట్రంలో బీసీలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. "కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు



42 శాతం రిజర్వేషన్లను కల్పించడం. "కుల గణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు" అని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో స్పష్టంగా పేర్కొని ఉంది. 6 నెలలు గడిచాయి... ఏడాది గడిచింది.. అయినా కూడా రిజర్వేషన్ల పెంపునకు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తోంది." అని తెలిపారు. కుల గణన పూర్తయ్యి కూడా చాలా కాలం అవుతుందని, కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ వివరాలను బహిర్గతం చేయలేదని ఎండగట్టారు. ఆ వివరాలను తక్షణమే బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని, డెడికేటెడ్ కమిషన్ నివేదిక సిద్ధమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. " బీసీల అంశాల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తోంది ? బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన ? 6 నెలల్లోపే అమలు చేస్తామన్న హామీ 12 నెలలు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదు ? హామీని అమలు చేయడానికి ఇంకెంత కాలం పడుతుంది ?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి దాదాపు ఏడాది పూర్తయ్యిందని, మండల, జిల్లా పరిషత్ ల పదవీకాలం కూడా ముగిసిందని, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజా పాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోందని వివరించారు. కానీ మీ ప్రభుత్వానికి త్వరగా రిజర్వేషన్లను పెంచి ఎన్నికలను నిర్వహించాలన్న సోయి లేనట్లు అర్థమవుతోందని అనుమానం వ్యక్తం చేశారు. బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందేనని తేల్చిచెప్పారు. కుంటి సాకులు చెప్పి ఇచ్చిన మాట కంటే తక్కువ రిజర్వేషన్లు కల్పిస్తే మాత్రం తెలంగాణ సమాజం మిమ్మల్ని సహించబోదని, బీసీల పక్షాన పోరాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ మీ మెడలు వంచి హామీని అమలు చేయించుకుంటామని హెచ్చరించారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను తక్షణమే 42 శాతానికి పెంచడానికి చర్యలను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# వైట్‌హౌస్ వెబ్‌సైట్‌లో రాజ్యాంగం తొలగింపు

**వాషింగ్టన్ :** డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే వైట్‌హౌస్ వెబ్‌సైట్‌లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అమెరికా రాజ్యాంగ పేజీని తొలగించడం అందులో గుర్తించదగ్గ పరిణామంగా వుంది. ఆ పేజీలో ప్రస్తుతం '404 ఎర్రర్' అని చూపిస్తోంది. ఈ మార్పుకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుండి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దేశ ప్రాథమిక పత్రాలపై ట్రంప్ ప్రభుత్వ వైఖరి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హోమ్ పేజీలో ప్రస్తుతం ట్రంప్ ఫోటో, అమెరికా ఈజ్ బ్యాక్ అనే సందేశం కనిపిస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న చర్యలు, జారీ చేసిన ఆదేశాలు వివరాలు, అలాగే ప్రభుత్వ ప్రాధాన్యతలు ఆ వెబ్‌సైట్‌లో కనిపిస్తున్నాయి. కానీ రాజ్యాంగం పేజీ కనబడకపోవడం ప్రజల దృష్టిని బాగా ఆకర్షిస్తోంది. అయితే ఇతర అనేక పేజీలు కూడా ఇదే ఎర్రర్‌ను చూపిస్తున్నాయి. పైగా స్పానిష్ భాషలో వున్న అధికార వైట్‌హౌస్ వెబ్‌సైట్‌ను ట్రంప్ ప్రభుత్వం తొలగించింది. అయితే వైట్‌హౌస్ వెబ్‌సైట్‌ను ఎడిటింగ్ సహా ఇతరత్రా మార్పులు చేపడుతున్నామని, ఈ క్రమంలో కొంత ఇబ్బందులు ఎదురవచ్చని త్వరలోనే మొత్తం రీ లోడ్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ కార్యదర్శి హారిసన్ ఫీల్డ్స్ చెప్పారు.

# ప్రయాణీకులపైకి దూసుకెళ్లిన రైలు

**జలగావ్:** మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో బుధవారం సాయంత్రం ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. మంటలు వ్యాపించాయన్న పుకార్లతో గబగబా రైలు దిగి పక్కనున్న ట్రాక్‌ను దాటుతుండగా ఎదురుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ వారిపైకి దూసుకెళ్లడంతో ఘోరం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో 12 మంది మరణించగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. సాయంత్రం 5:30 గంటల సమయంలో మహేజి, పర్ధడే స్టేషన్ల మధ్యలోని పచోరా సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లక్నో-ముంబయి మధ్య నడిచే పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఒక కోచ్‌లో హాట్ యాక్సిల్ లేదా బ్రేక్ బైండింగ్ కారణంగా నిప్పురవ్వలు చెలరేగడంతో మంటలు వ్యాపించాయన్న భయంతో ప్రయాణికులు చైన్ లాగారని ఒక అధికారి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని పచోరాలోని ఆసుపత్రులకు తరలించినట్లు చెప్పారు. ఈ రైలు ప్రమాదంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని, ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు.

# పౌరులను వేధించవద్దు ఇడికి బాంబే హైకోర్టు ఆదేశాలు

**ముంబయి :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వంటి కేంద్ర ఏజెన్సీలు పౌరులను వేధించటం ఆపాలని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. చట్టపరిధిలో పని చేయాలని ఆదేశించింది. తగిన ఆధారాలు లేకుండా ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిపై మనీలాండరింగ్ దర్యాప్తును ఇడి ప్రారంభించటాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. ఇందుకు ఇడికి రూ.1 లక్ష పెనాల్టీని విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ మిలింద్ జాధవ్ ఆదేశాలు జారీ చేశారు. "ఇడి వంటి చట్టాన్ని అమలుపర్చే ఏజెన్సీలకు ఒక బలమైన సందేశాన్ని పంపటం కోసమే ఈ అసాధారణ ఖర్చులు(పెనాల్టీ) విధించాల్సి వచ్చింది. సదరు ఏజెన్సీలు చట్టం పరిమితులకు అనుగుణంగా వ్యవహరించాలి. చట్టాన్ని వాటి చేతుల్లోకి తీసుకోవద్దు. పౌరులను వేదించొద్దు" అని జస్టిస్ మిలింద్ జాదవ్ అన్నారు. అయితే, ఇడి అప్పీలు కోసం ఈ కేసులో హైకోర్టు తన తీర్పును నాలుగు వారాలపాటు నిలుపుదల చేసింది.

# అర్హుల ఎంపిక కోసమే గ్రామసభ

## - అర్హుల జాబితాను చదివి వినిపించిన అధికారులు

**ముధోల్ (మనవెలుగు) జనవరి 23:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో లబ్ధిదారుల ఎంపిక కోసం మండల కేంద్రమైన ముధోల్లో ని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన గ్రామసభ లో తహసిల్దార్ శ్రీకాంత్ రేష న్ కార్డుల అర్హులైన జాబితాను చదివివినిపించారు. రైతు ఆత్మీయ భరోసా, రైతు భరోసా అర్హులైన జాబితాను వ్య వసాయ విస్తీర్ణ అధికారి సందేశ్ గ్రామ సభలో చదివి వినిపించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు లు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ను ఎంపీడీవో శివకుమార్ జాబితాను వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో గ్రామస్తులు హాజరై అర్హు లైన వారికి సంక్షేమ పథకాలలో పేర్లు లేకపోవడాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం ఇండ్లు లేని వారికి ఇండ్లను పంపిణీ చేస్తామని చెప్పి జాబితాలో పేర్లు లేకపోవడంతో ఆవేదనకు గురయ్యారు. అధికారులు మాట్లాడుతూ అర్హులైన వారి పేర్లు జాబితాలో లేకపోతే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాన్తులను స్వీకరించారు. స్వీకరణ ప్రక్రియ నిరంతరంగా సాగుతుందని వెల్లడించారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి నాలుగు పథకాలకు దరఖాస్తు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులున్నారు.



# రైతు కుటుంబాలకు భీమా డబ్బులు అందజేత

**ముధోల్ (మన వెలుగు) జనవరి 23 :**మండల కేంద్రమైన ముధోల్లోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో గురువారం వివిధ కారణాలతో మృతి చెందిన రైతులు లింగారావు (విట్టోలి), పోశట్టి(అష్ట) కుటుంబీకులకు రూ.2 లక్షల చొప్పున నామినేలకు భీమా డబ్బులను పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్- అసిస్టెంట్ రిజిస్టార్ జగదీష్- బ్యాంకు మేనేజర్ రీచారాణి అందించారు. మృతి చెందిన రైతులు సహకార సంఘంలో వ్యవసాయ రుణాలు తీసుకున్నారని పేర్కొన్నారు. వారికి రూ.803లతో ఎల్ఐసి బీమా చేయడం జరిగిందన్నారు. భీమా చేయడం వల్లనే కుటుంబీకులకు డబ్బులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ సాయిరాం, డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, గోపి పటేల్, పద్మ, పిఎసిఎస్ సీఈఓ సాయి రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఆర్జీయూకేటీ విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

## - అభినందించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్

**ముధోల్ మనవెలుగు జనవరి 23:** ఆర్జీయూకేటీ బాసర సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు టీమ్ వైకింగ్స్ విష్ణు నేషనల్ కాంక్రీట్ కానో (%ఎ చీజజ%) పోటీలో రెండవ బహుమతిని సాధించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ విద్యార్థులను ఆవిష్కరణ, జట్టుకృషితో విశ్వవిద్యాలయ నిబద్ధతను హైలైట్ చేస్తూ, టీమ్ వైకింగ్స్ అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు వైస్ ఛాన్సలర్ అభినందించారు. 14 మంది సభ్యుల జట్టు వైకింగ్స్, మెదక్ జిల్లా నర్సాపూర్లోని బి.వి.రాజు ఇనిస్టిట్యూట్లో జరిగిన ప్రతిష్టాత్మక పోటీలో అత్యుత్తమ విజయాన్ని సాధించింది. తేలికైన కాంక్రీట్ పడవను రూపొందించడం, నిర్మించడం ద్వారా బృందం అసాధారణమైన ఇంజనీరింగ్ నైపుణ్యాలను ప్రదర్శించింది, ఇది అద్భుతమైన స్థిరత్వం, తేలిక, బలం, యుక్తి, ఓర్పును ప్రదర్శించింది. 18 పాల్గొనే జట్లలో, టీమ్ వైకింగ్స్ ఎండ్యూరెన్స్ టెస్ట్, రిపోర్ట్ సమర్పణ కేటగిరీలలో రెండవ స్థానంలో ఉన్న అవార్డులతో పాటు మొత్తం రెండవ బహుమతిని పొందింది. ఈ విజయం ఆర్జీయూకేటీ విద్యార్థులు, అధ్యాపకుల అసాధారణమైన ప్రతిభను, అంకితభావాన్ని కొనియాడారు. విద్యాపరమైన నైపుణ్యం మరియు వినూత్న స్ఫూర్తికి విశ్వవిద్యాలయ ఖ్యాతిని బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసోసియేట్ డీన్ డాక్టర్ మహేష్, సివిల్ ఇంజనీరింగ్ హెచ్ ఓ డి డాక్టర్ ఖలీల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు




# ఐదవ రోజు బీసీ ఆజాద్ సైకిల్ యాత్ర

## హుజరాబాద్ నుండి కమలాపూర్ వరకు

**కూకట్పల్లి(మన వెలుగు) జనవరి 23:** బీసీ ఆజాద్ కన్వీనర్ సిద్దేశ్వర పటేల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత సతీష్ కుమార్ పటేల్ అధ్యక్షతన యాత్ర సుమారు 143 కిలోమీటర్ల వరకు సాగుతుంది ఫిబ్రవరి 2న జరిగే బీసీ భారీ బహిరంగ సభకు బీసీలను చైతన్యవంతులు చేయడం కోసం ఈ సైకిల్ యాత్ర చేస్తున్నట్టుగా పర్వత సతీష్ కుమార్ పటేల్ తెలిపారు రానున్న స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించకపోతే 42 మందితో అమరణ నిరాహార దీక్ష చేయడానికి సిద్ధం సిద్దేశ్వర పటేల్ చెప్పారు కార్యక్రమంలో బిసి నాయకులు టీం సభ్యులు లు అంబేద్కర్ ఆజాద్ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరి మాదిగ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుంటి విజయకుమార్ రజక సంఘం నాయకులు చామర్తి కూమార్ కమలాపూర్ తీన్మార్ టీం సాగర్ ప్రవీణ్ కమలాపూర్ కి ఘన స్వాగతం గా పలికి పుష్పగుచ్చాలి ఇచ్చి విశ్రాంతిని ఏర్పాటు చేశారు బీసీ నాయకులు మార్కెట్ యార్డు వద్ద ప్రసంగాలతో బీసీ లను ఏకతాటిపై తీసుకురావాలని.



# బాలికల పాఠశాలకు ఆమ్లిఫైర్ సిస్టం అందజేత

**ముధోల్ (మనవెలుగు) జనవరి 23:** మండల కేంద్రమైన ముధోల్ లోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పదివేల విలువగల అహుజా మొబైల్ ఆమ్లిఫైయర్ సిస్టంను ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొట్టూర్ శ్రీధర్ విరాళంగా అందించారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీత- ఉపాధ్యాయ బృందం పి.కవిత, అంజుమ్ పర్వీన్, స్వర్ణలత, కొక్కుల గంగాధర్, షాహిదా పర్వీన్, కవిత యాదవ్, పాఠశాలకు సహకరించి సౌండ్ సిస్టం అందించినందుకు దాత శ్రీధర్ కు ధన్యవాదాలు

# విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

**ముధోల్ (మన వెలుగు) జనవరి23:** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. ముధోల్ మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడ ఉపాధ్యాయులు- విద్యార్థుల హాజరును పర్యవేక్షించారు. అదేవిధంగా విద్యార్థులతో పాటు క్రింద కూర్చొని విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలను చక్కగా వచ్చే విధంగా బోధన చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనము చక్కగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు తదితరులున్నారు.



# ముధోల్లో ఇంపాక్ట్ ప్రోగ్రాం విజయవంతం

**ముధోల్ (మన వెలుగు) జనవరి 23:** మండల కేంద్రమైన ముధోల్లోని బస్వా గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ వికాసం తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థలకు చెందిన సుమారు రెండు వేల మంది విద్యార్థులు హాజరు అయ్యారు. ఈకార్యక్రమంలో వ్యక్తిత్వ వికాసంలో నిష్ణాతులైన గొప్ప గొప్ప స్పీకర్లు హాజరు అయ్యి విధార్థులకు కావలసిన జీవిత పాఠాలు, విద్యార్థుల భవిష్యత్తుకు కావలసిన సూచనల గురించి వివరించారు. ఐసీఐ (ఇంపాక్ట్ ఇంటర్నేషనల్) నేషనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ సోను మాట్లాడుతూ గురువు గంపా నాగేశ్వర్ రావ్ స్థాపించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ నేడు తప్పుదారిన పడుతున్న యువతను సరిఅయిన మార్గంలో నడిపించడం కోసం స్థాపించబడిన ఇంపాక్ట్ ఫౌండేషన్ గత ఆగష్టు నెలలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆర్గనైజషన్(ఐసీఐ )గా ఏర్పడిందని ఐసీఐ ఆధ్వర్యంలో యువతకు కావలసిన నైపుణ్యలను నేర్పిస్తున్నామని అన్నారు. ప్రోగ్రాం నిర్వాహకులు ఆనంధిత ఫౌండేషన్ చైర్మన్, ఐసీఐ రీజినల్ డైరెక్టర్ వాడేకర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఉచిత వ్యక్తిత్వ వికాసం తరగతులు నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంటీ నారకోటిక్ డిపార్ట్మెంట్ ఎస్పీ సీతారామ్ యువత డ్రగ్స్ బారిన పడుతున్నారని డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు చల్లా శ్రీధర్ రెడ్డి, శ్రీధర్ వీరమళ్ళ, శ్రీనివాస్ పెరుమాండ్ల, సతీష్ తూముతో పాటు వివిధ స్పీకార్లు విద్యార్థులకు కావలసిన జీవిత పాటల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ట్రైనర్లు కుతాడి తిరుపతి, చక్రి, శ్రీకాంత్, సాయి, మహేశ్వర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, సాయినాథ్, ప్రవీణ్, ప్రకాష్ పర్వజి వివిధ విద్యాసాంస్థలకు చెందిన చైర్మన్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు హాజరయ్యారు.




# బాసర బీరప్ప ఆలయ పునర్నిర్మాణం

## - మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

**ముధోల్ (మన వెలుగు) జనవరి 23:** బాసర గ్రామంలో గల బీరప్ప దేవాలయ పునర్నిర్మాణం కోసం గత ప్రభుత్వం పది లక్షల ప్రొసిడింగ్ ఇచ్చినట్లు ప్రకటించినప్పటికీ, నిధుల విడుదల ఆలస్యమవడం వల్ల పనులు నిలిచిపోయాయి. బాసర కురుమ సోదరులు ఈ విషయాన్ని ముందుకు తెచ్చి, ఆలయ పునర్నిర్మాణానికి నిధుల సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో, మాజీ సర్పంచ్ మమ్మాయి రమేష్ గారి ఆధ్వర్యంలో కురుమే రాజు, కురుమే బాబు, టౌన్ ప్రెసిడెంట్ రాజేశ్వర్ దేశముఖ్, శంకర్ చంద్రే తదితరులు గౌరవ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ను కలిసి సమస్యను వివరించారు. నారాయణరావు పటేల్ ఈ సమస్యను ప్రాముఖ్యతగా తీసుకుంటామని, త్వరలోనే నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీరప్ప దేవాలయ పునర్నిర్మాణం కురుమ సోదరులకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్నందున, దీనిపై శ్రద్ధతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడినారు.



# వైద్య చికిత్సకు అంగీకరించిన దల్లేవాల్ సుప్రీంకోర్టుకు తెలిపిన పంజాబ్

**న్యూఢిల్లీ :** రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ వైద్య చికిత్సకు అంగీకరించారని పంజాబ్ ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందంతో చర్చల అనంతరం ఆయన ఖన్నౌరి సరిహద్దులోని దీక్షా స్థలానికి 50 మీటర్ల దూరంలో ఉన్న తాత్కాలిక ఆస్పత్రికి తరలించామని తెలిపింది. సానుకూలమైన అభివృద్ధి అని ఈ నివేదికపై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఫిబ్రవరి 14న చండీగఢ్లో జరగనున్న కేంద్రం ప్రభుత్వ, ఇతర అధికారులతో చర్చల కోసం రైతులు అంగీకరించారని సుప్రీంకోర్టుకు సమర్పించిన మరో నివేదికలో పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ పేర్కొన్నారు. దల్లేవాల్కు మద్దతుగా దీక్ష చేపడుతున్న 110 మంది ఇతర రైతులు కూడా నిరాహార దీక్షను విరమించారని సింగ్ కోర్టుకు తెలిపారు. షెడ్యూల్ తేదీలకు రెండు రోజుల ముందు దల్లేవాల్ చండీగఢ్కు చేరుకోవాలని, పబ్లిక్ మెడికల్ యూనివర్శిటీ (పిజిఐ)లోని నిపుణులైన వైద్యులతో ఆయన ఆరోగ్యం గురించి సంప్రదించాలని, అప్పుడు ఆయన సమర్థవంతంగా చర్చల్లో పాల్గొనవచ్చని ధర్మాసనం దల్లేవాల్కు సూచించింది. చర్చలు ఫలవంతం కావాలని ఆశిస్తున్నామని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ కేసు విచారణను ఫిబ్రవరి నెలాఖరుకు తిరిగి జాబితా చేసింది. పంజాబ్ చీఫ్ సెక్రటరీ మరియు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసులపై ధిక్కార చర్యను ఉపసంహరించుకోవాలని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి వ్యక్తిగత హాజరును రద్దు చేయాలని కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ వైద్య సాయాన్ని పొందేందుకు దల్లేవాల్ను ఒప్పించడంలో వైఫల్యం చెందడంతో వారిపై కోర్టు ధిక్కార చర్యలకు ఆదేశించింది.

